సాక్షి

# రాపిడో యాప్‌తో మెట్రో టికెట్ బుకింగ్




**సాక్షి, సిటీబ్యూరో:** రాపిడో యాప్ ద్వారా మెట్రో టికెట్లను బుక్ చేసుకొనే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. రాపిడో బైక్, క్యాబ్, ఆటో వంటి సర్వీసుల బుకింగ్‌తో పాటు ప్రయాణికులు మెట్రో టికెట్లను సైతం పొందవచ్చు. ఇంటి నుంచి గమ్యం చేరేవరకు ఏకీకృత రవాణా సదుపాయాన్ని అందజేసే లక్ష్యంతో ఎల్ అండ్‌టీ హైదరాబాద్ మెట్రో, రాపిడో సంస్థలు ఈ మేరకు శనివారం ఒప్పందం ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ప్రయాణికులకు సంపూర్ణ రవాణా సదుపాయం లభించనుందని ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు తెలిపారు. రాపిడో యాప్‌లో మెట్రో టికెట్ బుకింగ్‌లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వేలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి రోజు సగటున 4.80 లక్షల మంది ప్రయాణికులు మెట్రోల్లో ప్రయాణిస్తుండగా, రాపిడో యాప్ ద్వారా మెట్రో టిక్కెట్ బుకింగ్ సదుపాయంతో మరో 15 శాతం ప్రయాణికులు పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా రాపిడో సహ–వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ.. రాపిడో యాప్‌లో మెట్రో టికెట్ బుకింగ్ సదుపాయంతో రాపిడో వినియోగదారులు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రయాణికులకు లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయం లభిస్తుందని చెప్పారు. ప్రయాణికులు రాపిడో సేవలను వినియోగించుకోవడం వల్ల మెట్రో నుంచి చివరి గమ్యం వరకు ప్రయాణ సదుపాయాన్ని పొందవచ్చని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రాపిడోతో ఒప్పందంపై ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ అండ్ సీఈఓ కేవీబీ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్ చిప్లుంకర్ పాల్గొన్నారు.